క్లుప్తంగా

హెడ్ కానిస్టేబుల్‌కు ఎస్పీ ప్రశంస



ఐవీ శ్రీనివాసరావుకు ప్రశంసపత్రం అందిస్తున్న ఎస్పీ దామోదర్

మార్కాపురం: స్థానిక పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా.. కోర్టు లైజినింగ్ ఆఫీసరుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఐవీ శ్రీనివాసరావును ఎస్పీ దామోదర్ అభినందించి శనివారం ప్రశంసపత్రం అందించారు. 2019 జనవరి 16న మార్కాపురం పట్టణంలో భర్త శరభయ్య భార్య పార్వతిని హత్య చేసిన ఘటనలో గుడ్‌ట్రైల్ మానిటరింగ్ ద్వారా నిందితుడైన శరభయ్యకు యావజ్జీవ శిక్ష విధించడంలో కృషి చేసినందుకు అభినందించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ నేరస్తులు తప్పించుకోకుండా సకాలంలో చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

7న ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక

బేస్తవారిపేట: మండలంలోని అన్నీ గ్రామాల్లో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధి హామి పనులపై ప్రజావేదిక ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టి.పార్వతి తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 6వ తేదీ వరకు పంచాయతీల్లో సామాజిక తనిఖీ జరుగుతుందని వివరించారు. ప్రజావేదిక కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

సమయపాలన పాటించని అధికారులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని అధికారులు శనివారం ఉదయం 10 గంటలు దాటినా కార్యాలయానికి హాజరు కాలేదు. సబ్ రిజిస్ట్రార్ రాధాకృష్ణతో పాటు కంప్యూటర్ సిబ్బంది ఎవరూ కార్యాలయానికి సమయానికి రాలేదు. ఒక వైపు పట్టణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం డీలా పడింది. దీంతో భూమి కొనుగోలు విక్రయాలు సక్రమంగా లేకపోవడంతో రిజిస్టర్‌లు కావడం లేదని అనుకున్నారో ఏమోగానీ కార్యాలయానికి ఎప్పుడు వెళ్తే ఏమిలే అని సరిపుచ్చుకుని అధికారు అలసత్వంతో కార్యాలయానికి వస్తున్నట్లు ఉంది. వ్యాపారం లేక విలవిలబోయిన రీతిలో కార్యాలయం బోసిపోవడంతో అధికార యంత్రాంగం సైతం కార్యాలయానికి సక్రమంగా రాకుండా సేవలను అందించడంలో అలసత్వం చూపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పగటి పూట పోలీసుల గస్తీ



చిన్న బస్టాండ్‌లో పోలీసులు

పొదిలి: పట్టణంలో పలు చోట్ల ఆకతాయిల గొడవలు.. ట్రిపుల్ రైడింగ్ చేస్తూ ట్రాఫిక్ అంతరాయం చేస్తున్నారు. దీంతో సీఐ మల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో ఎస్సై కోటయ్య పట్టణంలో పగటి పూట కూడా పోలీసుల గస్తీ టీమ్‌లను ఏర్పాటు చేశారు. దీంతో టీమ్ సభ్యులు మోటారు సైకిల్‌పై అనుమానం ఉన్న ప్రాంతాలు, ఫిర్యాదు అందుతున్న ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తున్నారు. ఏదైనా సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు ఫోన్ చేయాలని ఫోన్ నంబర్లు ఇస్తున్నారు. అనుమానం ఉన్న వ్యక్తులను ప్రశ్నిస్తున్నారు.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు



పండ్లు అందజేస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు రూరల్: బాల్య వివాహాలతో మహిళలకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని కె.ఎస్.పల్లె వైద్యాధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండల న్యాయసేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని దిగువమెట్ట చెంచు కాలనీలోని పాఠశాలల్లో శనివారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. బాల్య వివాహాలతో చిన్న వయసులోనే గర్భం దాల్చి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమే కాకుండా అటు ఆరోగ్యానికి సైతం హాని కలిగిస్తాయన్నారు. గిరిజన మహిళలకు పండ్లు పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఓంకార్, సర్పంచి అంజి నాయక్, డాక్టర్ మహ్మద్ జుబేరు, అటవీశాఖ డిప్యూటీ రేంజర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు మార్జిన్లూ స్వాహా!

- రహదారి అంచుల వెంట పంటల సాగు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనాలు

కొనకనమిట్ల: మండలంలోని పలు రహదారుల వెంట ఉన్న పంట భూముల యజమానులు రోడ్డు మార్జిన్‌లు ఆక్రమించి దున్ని పంటల సాగు చేస్తున్నారు. రహదారి వెంట రెండు పక్కలా 10 అడుగుల మేర మార్జిన్‌లు ఉంటాయి. అయితే దొనకొండ రోడ్డులో పలు చోట్ల మార్జిన్‌లు ఆక్రమించి చెట్లను తొలగించి చదును చేస్తున్నారు. ముఖ్యంగా దొనకొండ వెళ్లే రహదారిలో నాగరాజుకుంట, మునగపాడు, ఆరవల్లిపాడు గ్రామాల మధ్యలో మార్జిన్‌లు ఆక్రమించి చదును చేసి పొలంలో కలుపుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అలాగే నాగంపల్లి, చినారికట్ల, సిద్దవరం రహదారుల వెంట ఉన్న మార్జిన్‌లు ఆక్రమించి దున్నుతున్నారు. కొనకనమిట్ల, ఎదురాళ్లపాడు మార్గంలో కూడా రోడ్డు అంచులు ఆక్రమించుకుని చదును చేస్తున్నారు. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఎదురు వాహనాలకు సైడు ఇచ్చే క్రమంలో రోడ్డు మార్జిన్‌లు సరిగా లేకపోవడంతో వాహనాలు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు మార్జిన్‌లు ఆక్రమించి ఇరువైపుల అంచులు దున్ని పంటలు సాగు చేస్తున్నా ఆర్అండ్‌బీ అధికారులు చోద్యం చూస్తున్నారు.



రోడ్డు మార్జిన్ ఆక్రమించి వేసిన ఫెన్సింగ్





మునగపాడు-నాగరాజుకుంట మధ్యలో రోడ్డు మార్జిన్‌లను దున్నిన దృశ్యం

తల్లిపాలు అమృతంతో సమానం



అవగాహన ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు



కొనకనమిట్లలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

కొనకనమిట్ల: తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టాలని ఐసీడీఎస్ సీడీపీఓ సుధా మారుతి అన్నారు. శనివారం కొనకనమిట్లలో తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడారు. బాలింతలకు తల్లిపాల విశిష్టతను తెలియజేయాలన్నారు. తల్లిపాలు పట్టడం వలన బిడ్డకు వ్యాధి నిరోధకశక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తామని చెప్పారు. అనంతరం పలువురు గర్భిణులకు పౌష్టికాహార పదార్థాలను అందజేశారు. సూపర్‌వైజర్ పి.ప్రసన్న, హెల్త్ సూపర్‌వైజర్ శైలజ, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, ఆశాజ్యోతి, హెచ్ఎం కాశిరెడ్డి పాల్గొన్నారు.

ముర్రుపాలు తాగించాలి

గిద్దలూరు రూరల్: బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని ఐసీడీఎస్ సీడీపీఓ బూదాల జ్యోతి అన్నారు. తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కోటగడ్డ వీధి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లులకు, గర్భిణులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టిక ఆహారం అందజేస్తున్నామని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతో పుట్టాలంటే గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. తల్లులు పుట్టిన బిడ్డను ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించాలంటే మంచి బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు తాపడం వలన బిడ్డ ఆరోగ్యంగా పెరుగుతుందని సీడీపీఓ సుశీలాదేవీ తెలిపారు. శనివారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సాయిబాబా ఆలయ సెంటరులోని అంగన్‌వాడీ 45వ సెంటరులో తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బిడ్డ మానసిక, శారీరక ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. మాజీ కౌన్సిలర్ చంద్రావతి, సూపర్‌వైజర్ రమాదేవీ, కార్యకర్తలు జబీనా సుల్తానా పాల్గొన్నారు.



మార్కాపురం మాట్లాడుతున్న సుశీలాదేవి

కుక్కల దాడిలో దూడ మృతి

మార్కాపురం: పట్టణంలో కుక్కల దాడిలో చిన్నారులకు గాయాలు కావడంతోపాటు మూగజీవాలు చనిపోతున్నా మున్సిపల్ అధికారుల్లో మాత్రం చలనం ఉండటం లేదు. కౌన్సిల్ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు కుక్కలు, కోతుల బెడదను నివారించాలని అధికారుల దృష్టికి తీసుకొచ్చినప్పటికీ స్పందన కరువైంది. శనివారం కొండేపల్లి రోడ్డులో కుక్కల దాడిలో లేగదూడ మృతి చెందింది. మున్సిపల్ అధికారులు శునకాల బాధలు నివారించాలని నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు కోరారు. ఆవుల కోసం గోశాల నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.



కుక్కల దాడిలో మృతి చెందిన లేగ దూడ

రేషన్‌షాపుల తనిఖీ



స్టాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కంభం: పట్టణంలోని పలు రేషన్ షాపులను శనివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజేష్, గంగిరెడ్డిలు రెవెన్యూ సిబ్బందితో కలిసి 1 ,3 ,4, 5, 11 నంబర్లు గల రేషన్ షాపులను తనిఖీ చేశారు. ఒక్క షాపుపై ఎటువంటి కేసులు నమోదు కాలేదని అధికారులు తెలిపారు. అధికారులు తనిఖీలకు వస్తున్నారన్న విషయం తెలుసుకున్న పలుకు బడి ఉన్న పలువురు డీలర్లు తమ రేషన్ షాపులను మూసేసి ఫోన్‌లు స్విచ్ ఆఫ్ చేసుకున్నట్లు తెలుస్తోంది. అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేస్తే అక్రమంగా ఉన్న రేషన్ నిల్వలను పట్టుకోవచ్చని పలువురు అభిప్రాయ పడుతున్నారు. తనిఖీల్లో ఆర్ఐ శ్రీనివాసులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన తహసీల్దార్

తర్లుపాడు: తహసీల్దార్‌గా జయవర్ధన్ శనివారం విధుల్లో చేరారు. రెవెన్యూ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఇప్పటివరకూ పనిచేసిన తహసీల్దార్ అబ్దుల్ హమీద్ నెల్లూరు జిల్లాకు బదిలీకావడంతో వీడ్కోలు పలికారు.

భక్తి శ్రద్ధలతో శ్రీవారి పూజలు



వెలుగొండలో అలంకరణలో శ్రీవారు



రేగడపల్లిలోఅలంకరణలో శ్రీవారి ఉత్సవ మూర్తులు

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మండలంలోని వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం భక్తుల సందడి నెలకొంది. నమో వేంకటేశాయా నమోనమః అంటూ భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రేగడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు.

కుడి కాలువకు సాగు నీరందించాలి

దర్శి: కుడి కాలువకు సాగు నీరందించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం శ్రీనివాసులు కోరారు. స్థానిక ఎన్ఎస్‌పీ కార్యాలయంలో ఈ మేరకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎడమ కాలువకు సాగుకు, తాగు నీటికి నీరు విడుదల చేశారని చెప్పారు. కుడి కాలువకు కూడా సాగు నీరు విడుదల చేసి జిల్లాను కాపాడాలని కోరారు. ప్రకాశం జిల్లాలో వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయని, పశుపక్షాదులకు నీరు లేక సాగు చేసిన పంటలు కూడా ఎండిపోతున్నాయని చెప్పారు. త్వరితగతిన కాలవలకు నీరు విడుదల చేసి చెరువులను కూడా నింపాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు తిండి నారాయణరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాడపాకుల శ్రీను, పట్టణ అధ్యక్షుడు అమృత గురవార్జునరావు, రూరల్ మండల అధ్యక్షుడు కాకర్లసాయి, తెలుగు రైతు నాయకులు తానికొండ ఓబయ్య పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు కోసం జాతీయ ఉద్యమం

పొదిలి: సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని, లేని పక్షంలో జాతీయ స్థాయిలో ఉద్యమం చేపట్టాలని ఎస్‌టీఎఫ్ఐ ఎడ్యుకేషన్ సెమినార్‌లో తీర్మానించినట్లు యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు అబ్దుల్ హై శనివారం చెప్పారు. ఢిల్లీ సమీపంలోని ఫరీదాబాద్‌లో స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన సెమినార్‌లో యూటీఎఫ్ జిల్లా ప్రతినిధిగా పాల్గొన్న అబ్దుల్ హై సెమినార్ వివరాలను తెలిపారు. ఉద్యోగులు 30 సంవత్సరాలు సర్వీస్ చేసినప్పటికీ వారికి సామాజిక భద్రత పెన్షన్ లేకుండా ప్రభుత్వాలు చేశాయన్నారు. నూతన జాతీయ విద్యా విధానం 2020పై చర్చ జరిగిందన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, టెంపరరీగా ఉపాధ్యాయుల నియామకాలు జరుగుతుండటంతో ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం మత ప్రాతిపదికన కమ్యునలైజేషన్ ఎడ్యుకేషన్ తీసుకవస్తోందని దీంతో లౌకిక ప్రజాస్వామ్యం ఇబ్బందుల్లో పడుతోందని ఆందోళన చెందారు. ప్రభుత్వ పాఠశాలల్లోని సిలబస్‌లో లౌకిక పాఠ్యాంశాలను తొలగిస్తున్నారని, దీంతో రాజ్యాంగానికి తీవ్ర ముంపు వచ్చే ప్రమాదం ఏర్పడుతోందన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చ జరిగిందని తెలిపారు. 19 రాష్ట్రాల నుంచి 150 మంది ప్రతినిధులు పాల్గొన్న ఈసెమినార్‌లో జిల్లా నుంచి యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు శ్రీనివాసరావు, ఆడిట్ కమిటీ కన్వీనర్ రాము పాల్గొన్నట్లు అబ్దుల్‌హై తెలిపారు.



ఎస్‌టీఎఫ్ఐ జాతీయ స్థాయి నాయకులతో అబ్దుల్‌హై

కేరళ వరద బాధితులకు విరాళాల సేకరణ

గిద్దలూరు రూరల్: కేరళలోని వాయనాడులోని వరద బాధితులను ఆదుకునేందుకు ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకులు శనివారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి ఫెడరేషన్ అధ్యక్షుడు కొమ్ముసూరి అరుణ్ మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో జూలై 30వ తేదీన వరదలతో కొండ చర్యలు విరిగిపడి అక్కడి ప్రజలు పూర్తిగా నిరాశ్రయులయ్యారు. అలాంటి వారిని ఆదుకునేందుకు మన వంతు సాయంగా విరాళాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల నుంచి రూ.6,715 నగదు సేకరించామని, ఈ నగదును బాధితులకు పంపిస్తామని తెలిపారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకులు అంజన్‌కుమార్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న విద్యార్థులు

ఎమ్మార్పీఎస్ కార్యకర్తలకు అభినందనలు



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు షాలేంరాజు

బేస్తవారిపేట: ఎస్సీ వర్గీకరణ సాధనలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకునికి కృతజ్ఞతలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు షాలేంరాజు అన్నారు. శనివారం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మూడు దశాబ్దాలుగా సాగిన ఉద్యమంలో ఎంతో మంది జైళ్లలో మగ్గారని, మరికొందరు ఆత్మ బలిదానాలు చేసుకుని అశువులు బాశారన్నారు. జంక్షన్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేశారు. బస్టాండ్ ఆవరణలో వర్గీకరణ సాధనలో ప్రాణాల్పించిన వారికి నివాళులర్పించారు. బాణసంచా కాల్చుతూ, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బూదాల ఆనంద్, ఎమ్మార్పీఎస్ నాయకులు జయరాజ్, భరణి, ఆనంద్, మాజీ జెడ్పీటీసీ తాతపూడి ఐజయ్య, ఎంపీటీసీ సభ్యులు కుంపటి సురేష్, పూనూరు భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో చెన్నకేశవస్వామి మూలవిరాట్



ప్రత్యేక అలంకరణలో ప్రసన్న వెంకటేశ్వరస్వామి

మార్కాపురం టౌన్: శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామివారికి శనివారం ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. చెన్నకేశవస్వామి మూలవీరాట్‌కు ఆలయ అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, అర్చక బృందం అభిషేకాలు, అర్చన తదితర పూజలను నిర్వహించారు. పట్టణంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కందిలో వైరస్ తెగులుపై అప్రమత్తంగా ఉండాలి



పంటలు పరిశీలిస్తున్న అధికారులు

దర్శి: కంది పంటలో వైరస్ తెగులుపై అప్రమత్తంగా ఉండాలని దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులు కె.బాలాజీనాయక్ సూచించారు. మండలంలోని వెంకటాచలంపల్లి, చందలూరు గ్రామాల్లో రైతులు వేసిన సజ్జ, కంది పంటలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా బాలాజీనాయక్ మాట్లాడుతూ 38 గ్రామాల పరిధిలో సజ్జ, కంది పంటలు సాగు చేయనున్నట్లు పేర్కొన్నారు. దాదాపు 40 శాతం విత్తడం జరిగిందని చెప్పారు. నాటిన 40 నుంచి 50 రోజుల వ్యవధిలో కంది పంటపై సల్ఫర్ పిచికారీ చేసి వైరస్ ఒక మొక్క నుంచి మరొక మొక్కకు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కందిలో ఎండు తెగులు సోకకుండా విత్తన శుద్ధి చేసి నాటుకోవాలన్నారు. కంది పంటను ఆశించే గూడ పురుగు ఉధృతిని తగ్గించాలంటే మొదటి దశలో వేపనూనె కషాయం పిచికారీ చేయాలన్నారు. సజ్జ పంటలు ఎటువంటి తెగుళ్లు రాకుండా తగిన చర్యాలు గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వి.బాలాజీ నాయక్ ఈ క్రాప్ గురించి, కౌలు రైతులు ఈ-క్రాప్‌లో నమోదు చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు.